క్లుప్తంగా

బీసీల సమస్యలపై ఐక్యంగా పోరాటం

- వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు అశోక్ చక్రవర్తి



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో అశోక్ చక్రవర్తి

టెక్కలి: జిల్లాలో బీసీల సమస్యలపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఐక్యంగా పోరాటాలు చేసి అండగా ఉంటానని పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మార్పు అశోక్ చక్రవర్తి తెలిపారు. మాజీ సీఎం, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గురువారం సాయంత్రం తాడేపల్లిలో కలిసి బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించినట్లు శుక్రవారం తెలిపారు. తనకు ఈ పదవి దక్కడంపై పార్టీ టెక్కలి నియోజక వర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాంతో పాటు జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సక్రమంగా పారిశుద్ధ్య నిర్వహణ



చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో వసంతకుమార్ తదితరులు

పలాస: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఎంపీడీవో కె.వసంతకుమార్ అన్నారు. గురుదాసుపురం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణను శుక్రవారం ప్రారంభించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాలువలను శుభ్రంగా చేసుకోవాలని, చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలని స్థానికులకు సూచించారు. సర్పంచ్ కుత్తుం రూపావతి, పంచాయితీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, పంచాయతీ కార్యదర్శి సార అప్పారావు, కుత్తుం లక్ష్మణరావు ఉన్నారు.

లొత్తూరులో గ్రామ సభ



గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

పలాస: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.వసంతకుమార్ అన్నారు. లొత్తూరు గిరిజన పంచాయతీలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న 'ధరటి ఆబా జనభాగీదారి అభియాస్' కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ సవర పద్మ అధ్యక్షతన జరిగిన సభలో వివిధ సంక్షేమ పథకాలను ఎంపీడీవో వివరించారు. పథకాలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. పంచాయతీలోని ప్రతి హేబిటేషన్‌లో చేపడుతున్న ఇంటింటా సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. డిప్యూటీ ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత ఉజ్జాపన పూజలు



ఉజ్జాపనల ఊరేగింపులో మహిళలు

కంచిలి: మండల కేంద్రంలోని ఎస్.ఆర్.సి.పురం కాలనీలో సామూహికంగా సంతోషిమాత ఉజ్జాపన పూజలను శుక్రవారం స్థానిక మహిళలు చేశారు. పూజల అనంతరం అమ్మవారిని మేళతాళాలతో ఊరేగించారు. ఘటాలతో పూజల్లో పాల్గొన్నారు.

పల్లె కన్నీరు పెడుతోంది..!

- పంచాయతీలకు అందని 15వ ఆర్థిక సంఘం నిధులు
- నిధుల లేమితో ఆగిన గ్రామాభివృద్ధి
- పట్టించుకోని ప్రభుత్వం

ఇచ్ఛాపురం రూరల్:



ఎం.తోటూరులో మురుగు నిల్వ

కూటమి ప్రభుత్వ హయాంలో పల్లెలు కన్నీరు పెడుతున్నాయి. వ్యవస్థల నిర్వీర్యమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తుండడంతో ప్రగతి పడకేసింది. గ్రామాభివృద్ధికి దోహదపడే గ్రామ సచివాలయ వ్యవస్థకు ఇప్పటికే మంగళం పాడే దిశగా అడుగులు వేస్తుండగా, వ్యవసాయ రంగాన్ని కుదేలయ్యేలా చేసింది. తాజాగా గ్రామ పంచాయతీలను నాశనం చేసేందుకు కంకణం కట్టుకుందోనే విమర్శలు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు పంచాయతీలకు ఇవ్వకుండా నిలిపి వేయడంతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి పడకేసింది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల పరిధిలో 98 పంచాయతీలు ఉన్నాయి. 15వ ఆర్థిక సంఘ నిధులు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.2.60 కోట్లు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. ఈ పరిణామం ప్రజల్లో విమర్శలకు తావిస్తోంది. ఆర్థిక సంఘం నిధుల కోసం పంచాయతీ పాలకులు ఎదురుచూస్తున్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

మండలం	పంచాయతీల సంఖ్య	మొదటి విడత విడుదలైన నిధులు రూపాయల్లో..	రెండవ విడత విడుదల కావాల్సిన నిధులు రూపాయల్లో..
ఇచ్ఛాపురం	21	60,00000	39,00000
కవిటి	23	87,00000	57,00000
కంచిలి	31	77,00000	51,00000
సోంపేట	23	90,00000	59,00000
మొత్తం	98	3,14,00000	2,06,00000

తొలి విడతలో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 2024–25 ఆర్థిక సంఘం నిధులు తొలి విడతగా 2024 నవంబర్ నెలలో రూ.3.14 కోట్లు విడుదల చేసింది. రెండో విడత నిధులు రెండు నెలల క్రితం కేంద్రం విడుదల చేసినా ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు పైసా విదల్చలేదు. ఈ నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తుందా అని సర్పంచ్‌లు ఎదురు చూస్తున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు జరగడం లేదు. వీధుల్లో సరైన రహదారులు లేక మట్టిరోడ్లపైనే గ్రామీణ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. పంచాయతీల్లో ఇంటి పన్ను పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది జీతాలు, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాల నిర్వహణకే సరిపోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ముచ్చింద్ర ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్లే రహదారి దుస్థితి

స్తంభించిన పనులు..

ఆర్థిక సంఘం నిధుల విడుదలలో జాప్యం కారణంగా గ్రామాల్లో పనులు ముందుకు సాగడం లేదు. ఆర్థిక సంఘం నిధులను టైడ్ ఇన్‌స్టాల్‌మెంట్, బేసి క్ ఇన్‌స్టాల్‌మెంట్ అని రెండు పద్ధతుల్లో జమ చేస్తా రు. గ్రామంలో జనాభా ప్రాతిపదికన ఈ నిధులు వస్తుంటాయి. పంచాయతీల్లోని కొన్ని నిర్ణీత పనులకు 50 శాతం నిధులు, మిగిలిన నిధులు ఇతర పనులకు వినియోగిస్తుంటారు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటికి ఇలా అనేక పనులకు నిధులు వెచ్చిస్తారు. ప్రస్తుతం వర్షాల సీజన్ కావడంతో ప్రతీ పంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వ్యాధులు సంక్రమించకుండా కేవలం బ్లీచింగ్ పౌడర్‌ను అక్కడక్కడా జల్లుతూ మమా అనిపించుకుంటున్నారు.

పంచాయతీలను నిర్వీర్యం చేస్తోంది



కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోంది. గ్రామాభివృద్ధి కుంటుపడటంతో ప్రజలు సర్పంచ్‌లపై అపోహలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేసి పంచాయతీల పురోభివృద్ధికి సహకరించాలి

– కారంగి త్రినాథ్‌రెడ్డి, సర్పంచ్, టి.బరంపురం

నిధులు విడుదల కాగానే పనులు



15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు మంజూరు కాగానే పంచాయతీల్లో ముఖ్యమైన అభివృద్ధి పనులకు వినియోస్తాం. జూలై మొదటి వారంలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. సర్పంచ్‌లు పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

– ఎస్.కృష్ణ, పంచాయతీ విస్తీరణాధికారి, ఇచ్ఛాపురం మండలం

కుంటుపడిన అభివృద్ధి



రెండో విడతలో ఫిబ్రవరి నెలలో ఇవ్వాల్సిన 15వ ఆర్థిక సంఘ నిధులు ఇప్పటి వరకు పంచాయతీలకు కేటాయించలేదు. నిధుల లేమితో అభివృద్ధి కుంటుపడింది. పంచాయతీల నిర్వాహణ కష్టంగా మారుతోంది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించాలి. నిధుల విడుదల చేయడంలో ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యం సరికాదు.

– నర్తు వరప్రసాదరావు, సర్పంచ్, ఈదుపురం పంచాయతీ

ఏగ్జోబిన్ కంపెనీ ప్రతినిధుల స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కంపెనీ ప్రతినిధులతో ఆర్‌డీవో కృష్ణమూర్తి

సంతబొమ్మాళి: నౌపడ పరిసర ప్రాంతాల్లోని సాల్ట్ భూములను ఏగ్జోబిన్ కంపెనీ ప్రతినిధులు టెక్కలి ఆర్‌డీవో కృష్ణమూర్తితో కలిసి శుక్రవారం పరిశీలించారు. స్థలంతో పాటు నీరు, విద్యుత్, రోడ్లు, రైల్వే సౌకర్యాలు ఏ విధంగా ఉన్నయో క్షేత్రస్థాయిలో చూశారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో కృష్ణమూర్తి మాట్లాడుతూ.. రూ.90 వేల కోట్లతో పెట్టుబడులు పెట్టడానికి ఏగ్జిబిన్ కంపెనీ ప్రతినిధులు స్థలంతో పాటు ఇతర సౌకర్యాలను పరిశీలించడానికి వచ్చారని తెలిపారు. పాలిమర్స్, పెట్రో కెమికల్ కంపెనీలు పెట్టడానికి అనువైన స్థలాలను పరిశీలిస్తున్నారని అన్నారు. స్థల పరిశీలనలో యూఎస్‌ఏ ప్రతినిధులు జాయ్ వేస్ట్ కాట్, సేలింలా పాల్గొన్నారు.

వివేకానందుని విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో ఉపాధ్యాయులు

సోంపేట: స్వామి వివేకానంద చూపిన మార్గం మానవాళికి అనుసరణీయమని వక్తలు కొనియాడారు. సోంపేట ఉన్నత పాఠశాల ఆవరణలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు టి.జోగారావు ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన వివేకానంద విగ్రహాన్ని విశాఖపట్నం రామకృష్ణ మిషన్ ఆశ్రమం కార్యదర్శి స్వామి స్వసం వేద్యానందాజీ మహారాజ్ శుక్రవారం ఆవిష్కరించారు. స్వామి వివేకానందుడు చూపిన మార్గంలో యువత నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గరుడాచల శంకరరావు, సంపతిరావు విశ్వనాథం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.మల్లేశ్వరరావు, రెల్ల నారాయణ, కొంచాడ వేణు, దుద్ది వీర్రాజు ఉన్నారు.

భోజన నిర్వాహకుల సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందజేస్తున్న దృశ్యం

పలాస: ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కనీస వేతనాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె నోటీసును అందజేశారు. జూలై తొమ్మిదో తేదీన కేంద్ర కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మెలో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులు కూడా పాల్గొంటారని వివరిస్తూ విద్యాశాఖాధికారి చెరుకుపల్లి సుధాకర్‌కు సమ్మెనోటీసు అందజేశారు. సంఘ నాయకులు పి.భూదేవిపాత్రో, వై.మణమ్మ, బి.శశిరేఖ, కృష్ణవేణి, బి.శకుంతల ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

కాశీబుగ్గ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలాస నియోజకవర్గంలోని మండలాలు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలకు పార్టీ కమిటీలను శుక్రవారం నియమించారు. పలాస మండల వైస్ ప్రెసిడెంట్లుగా రౌతు శంకరరావు, బొడ్డు సుధాకర్, జనరల్ సెక్రటరీలుగా పోతనపల్లి మాధవరావు, కొర్ల సంతోష్, గొండు మోహనరావు, కొర్ల మురళీక్రిష్ణ, కార్యదర్శులుగా శిష్టు తేజ, వంకల షణ్ముఖరావు, ఖగేష్ దొర, బొడసింగి ధనుంజయ నియమితులయ్యారు.

- పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ వైస్ ప్రెసిడెంట్లుగా నర్తు వెంకటరమణ, గుజ్జు జోగారావు, జనరల్ సెక్రటరీలుగా మల్లా సురేష్‌బాబు, బిరాటి వల్లభరావు, కర్రి మాధవరావు, పప్పల ప్రసాదరావు, కార్యదర్శులుగా రంది రాజారావు, అట్టాడ ప్రశన్న, నరేష్‌కుమార్ సింధిరి, మార్పు రాములను నియమించారు.
- **మందస:** మందస మండల వైస్ ప్రెసిడెంట్‌గా దుంపల వైకుంఠరావు, పులరి పీతంబరం, జనరల్ సెక్రటరీలుగా నాగేశ్వర్ బృందావన్, సురేష్ పాణిగ్రహిహి, బత్తిని వెంకట్, పసుపురెడ్డి రాము, సెక్రటరీలుగా అగ్గున దేవేంద్ర, సవర రాము, గోరక కేశవరావు, గుంపు జగదీష్ నియమితులయ్యారు.
- **వజ్రపుకొత్తూరు:** మండల పార్టీ ఉపాధ్యక్షులుగా దున్న బాలరాజు, తమ్మినేని శాంతారావు, ప్రధాన కార్యదర్శులుగా హనుమంతు బాలక్రిష్ణ, జోగి అప్పారావు, మామిడి భాస్కరరావు, చింత రాజు, కార్యదర్శులుగా సొదాల వెంకన్న, గొరకల విశ్వనాథం, డొంక విద్యాసాగర్, సైని కేశవరావు నియమితులయ్యారు.

కాలువలు ఇలా..
సాగునీరు పారేదెలా..?

- ఆందోళనలో అన్నదాత



ప్లాస్టిక్ సంచులు, గుర్రపు డెక్కతో దర్శనమిస్తున్న కుడి ప్రధాన కాలువ

మందస: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఆయకట్టుకు సాగునీరు అందించే ప్రధాన కాలువల్లో జంగిల్స్ క్లియరెన్స్ చేయని పరిస్థితి నెలకుంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైనప్పటికీ కాలువల్లో పూడికతీత పనులు చేయకపోవడం దారుణమని రైతులు విమర్శిస్తున్నారు. మందస కేంద్రంలోని పలు గ్రామాలకు మహేంద్రతనయ నది నుంచి వచ్చే నీటిని దామోదర్‌సాగర్ రిజర్వాయర్‌కు సంబంధిత అధికారులు మళ్లిస్తుంటారు. అక్కడ నుంచి ప్రధాన కాలువల ద్వారా ఆయకట్టుకు విడిచి పెడతారు. అయితే ఎంతో ప్రాధాన్యం ఉన్న కాలువల్లో పిచ్చిమొక్కలు, పూడికతీత పనులను ఈ సంవత్సరం ఇప్పటి వరకూ చేపట్టలేదు. వాస్తవంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కాలువల్లోని పూడికలు, చెత్త, గుర్రపు డెక్కను జేసీబీలతో తొలగించి ఖరీఫ్ సీజన్‌లో పంటలకు ఇబ్బంది లేకుండా నీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనప్పటికీ ఇప్పటివరకు ఈ సమస్యపై అధికారులు దృష్టిసారించలేదు. మహేంద్ర తనయ నుంచి వచ్చిన నీటిని మండలంలో ఉన్న దామోదర్‌సాగర్ రిజర్వాయర్ నుంచి నర్సీపురం, దేవుపురం, మహదేవుపురం, చత్రపురం, డిమిరియా మీదుగా మందసకు కాలువ నుంచి నీరు ప్రవహిస్తుంది. ప్రస్తుతం ప్రధాన కాలువలు పూడికలు, చెత్త,గుర్రపు డెక్కలతో నిండి అధ్వానంగా ఉంది. ఉమాగిరి, పితాతోళి, భైరి సారంగిపురం, డబార్, పుచ్చపాడు గ్రామాల్లోని సుమారు 500 ఎకరాల ఆయకట్టుకు ఈ కాలువ నుంచి సాగునీరు అందించాల్సి ఉంది. వర్షకాలం ప్రారంభమైనప్పటికీ కాలుల్లో పూడికలను తొలగించకపోవడంతో రైతు ఆందోళన చెందుతున్నారు. జేనా చెరువు నుంచి ఉమాగిరి వరకు కాలువ అధ్వానంగా ఉంది. పూడికలు, ప్లాస్టిక్ సంచులు, గుర్రపు డెక్కలతో పూర్తిగా నిండిపోయి ఉండడంతో నీరు ప్రవహించని పరిస్థితి నెలకుంది. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టి సాగునీటికి ఇబ్బందిలేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



పూడికలతో నిండిన ఎడమ ప్రధాన కాలువ

త్వరలో పూడికలను తొలగిస్తాం



ఏటా సాగునీటి కాలువలను శుభ్రం చేస్తున్నాం. ఈ ఏడాది కూడా శుభ్రపరిచేందుకు ఓ ఎండ్ ఎమ్ వర్క్‌లో పెట్టాం. సీఎం ఫండ్స్‌లో కూడా తీర్మానం చేశాం. అనుమతులు వచ్చిన వెంటనే కాలువను శుభ్రం చేస్తాం. సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్య తీసుకుంటాం.

–ఎస్.వి.శ్రీనివాసరావు, ఏఈ, ఇరిగేషన్ శాఖ, మందస

ఆర్థిక సాయం



వజ్రపుకొత్తూరు మండలం పూడిజగన్నాథపురం గ్రామానికి చెందిన దుమ్ము ఏకాంబరం రైలు నుంచి జారిపడిన ఘటనలో కాలు పోగొట్టుకొని మంచానికే పరిమితమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న స్నేహితులు అండగా నిలిచారు. స్థానిక హ్యాండ్స్ టుగెదర్ ట్రస్ట్ ప్రతినిధుల ద్వారా రూ.15 వేలు సేకరించారు. టీఎస్ఎఫ్ ఫ్యాబ్రికేషన్ కంపెనీలో పని చేస్తున్న తోటి మిత్రులు దున్న నాగేష్, ఇతర స్నేహితులు కలిసి ఈ మొత్తాన్ని బాధితుడుకి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో హ్యాండ్స్ టు గెదర్ ట్రస్ట్ ప్రతినిధులు ఆదినారాయణ, గణపతి, మాధవరావు, రవి, ఉమాపతి పాల్గొన్నారు. –వజ్రపుకొత్తూరు

సాధన కమిటీ సమావేశం



మందస మండలం అంబుగాం గ్రామంలో వంశధార సాగునీరు సాధన కమిటీ సమావేశం శుక్రవారం సమావేశం జరిగింది. కమిటీ ప్రతినిధి తిరునగరి సవరయ్య మాస్టార్ మాట్లాడుతూ.. వంశధార కెనాల్ వేశి బట్టి ద్వారా తరల తాళ్లభద్ర రైల్వే లైన్ ఆనుకొని బొడ్డపాడు చెరువును కలుపుకొని సంకు జోడి దామోదర్ గ్రావిటీ ద్వారా నీరు అందించవచ్చునన్నారు. నీటి సాధన కమిటీకి తమపూర్తి సహకారం ఉంటుందని రైతు సంఘాల ప్రతినిధులు ముకుందారావు, మజ్జి బాబూరావు అన్నారు. నాయకులు మార్పు మన్మథరావు, వెంకటరావు, నల్ల హడ్డి మాస్టార్, మాధవరావు, హేమారాజ్, వైకుంఠరావు, సోమనాథం పాల్గొన్నారు. –మందస

మొక్కలు నాటివేత



చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానీ శంకర్ అన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులుగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వ్యవసాయ శాఖ కార్యాలయం అవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, సిబ్బంది భవానీ శంకర్‌కు అభినందనలు తెలియజేశారు. –సోంపేట

కమనీయం జగన్నాథుని రథోత్సవం

దేవదేవుడు జగన్నాథుని రథయాత్ర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ఆరంభమయ్యాయి. భక్తులు జగన్నాథ, బలభద్ర, సుభద్రలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రథాన్నిలాగి భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. రథయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. టెక్కలిలో గజపతిరాజుల వంశీయులు స్వామి వారికి తొలి పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. దేవదాయ.. ధర్మాదాయ శాఖా ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యుల నేతృత్వంలో స్వామివారి రథాన్ని తరలించే కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. పండాల నేతృత్వంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. –సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం: రథంపై పూజలందుకుంటున్న జగన్నాథస్వామి



కంచిలి: స్వామిని దర్శించుకుంటున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు నర్తు శివాజీ తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: కీర్తిపురంలో రథోత్సవ సందడి



కవిటిలో కదులుతున్న స్వామివారి రథం



టెక్కలి: జగన్నాథస్వామికి పూజలు చేస్తున్న పండాలు



మందసలో రథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



సోంపేట: బారువలో రథయాత్ర



కంచిలిలో జగన్నాథ రథయాత్ర



కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో జగన్నాథ రథాన్ని లాగుతున్న భక్తజనం



వజ్రపుకొత్తూరు: అనంతగిరిలో రథానికి పూజలు చేస్తున్న భక్తులు